క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కాకినాడ రూరల్: ఈ నెల 13న జరుగనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది యనమల రామం అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో రామం మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పాండురంగారావు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ పంచాయతీ ఇన్‌చార్జిగా పాండురంగారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం వాకలపూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జొన్నాడ నరసింహారావు ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాల్సి ఉంది. ఈలోగా పాండురంగారావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

నేత్రదానంపై అవగాహన

బాలాజీచెరువు: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల వాకర్స్‌కు సోమవారం అవగాహన కల్పించారు. బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ట్రస్టీలు చంద్రశేఖర్ మాట్లాడుతూ నేత్రదానంపై ఇప్పటికీ అవగాహన లేక చాలామంది ముందుకు రావడం లేదన్నారు. దానిపై అవగాహన పెంచుకుని బంధువులతో పాటు స్నేహితులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం కరపత్రాలు అందజేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐబ్యాంక్ సిబ్బంది నానాజీ, కె.నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఏడీ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, పీవో తేజేశ్వరరావు

బాలాజీచెరువు: గత నెల 22 నుంచి 28 వరకూ హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో జాతీయ స్థాయి రెడ్‌క్రాస్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆదిత్య విద్యార్థులు ఎం.రాహుల్‌కుమార్, వి.సంతోష్‌కుమార్ పాల్గొని ప్రథమ చికిత్సపై నిర్వహించిన నాటికలో ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ విభాగం నుంచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ యూత్ రెడ్‌కల్చర్ వలంటీర్ వింగ్ నుంచి విద్యార్థులు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని వారిని అభినందించారు.

హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



రవిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘ సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందని చెవూరి రవి నియమితులయ్యారు. కాకినాడ అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న ఈయనను విజయవాడ లయోలా కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సెల్ సమావేశంలో ఎంపిక చేశారు. సోమవారం ఆయన్ని జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుల సంఘం అభినందించింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ముఖ్యంగా ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి



గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఎలక్ట్రికల్ కార్మికులు పేర్లు నమోదు చేయించుకోవాలని ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు రమణరాజు అన్నారు. పిఠాపురంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు.

వృద్ధుడిపై ఫిర్యాదు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరానికి చెందిన వృద్ధుడిపై సోమవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ధర్మవరం సచివాలయ ఉద్యోగిని తుర్రం రాధిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జగన్నాథరాజు చిరునామా కోసం రామరాజు (86)ని అడిగారు. ఇదే నివాసమంటూ తనను లోపలికి రమ్మంటూ అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపడతామని స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం చెప్పారు.

సాగర తీరాన... శరవేగాన

- సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనోత్సవాలకు చకచకా పనులు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల నిఘా





వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాల కోసం సూర్యారావుపేట బీచ్‌లో గ్రావెల్ రోడ్డు పనులు, బీచ్ వద్ద చెత్త తొలగింపు పనుల్లో పారిశుధ్య కార్మికులు

కాకినాడ రూరల్: గణేష్ మహరాజ్ కీ జై.. బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా అంటూ నిర్వహించే వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలకు వేళయ్యింది.. విఘ్నాలు తొలగించి, విజయాలు అందించే గణపతిని చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు చవితి మండపాల్లో వెలసిన వినాయక విగ్రహాలతో పాటు అపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను కొలిచారు. చివరగా నిమజ్జనోత్సవాలకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సాగర తీరం, కాలువల్లో నిమజ్జనాలు చేసేందుకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. కాకినాడ నగరం, రూరల్‌లో గణేశ విగ్రహ నిమజ్జనోత్సవాలకు పెట్టింది పేరు. ఇందుకు గాను కాకినాడ సూర్యారావు బీచ్‌ను తీర్చిదిద్దారు. విశాలమైన సాగర తీరాన వందలాది గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసుకునేలా ఏటా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది బీచ్‌లో సందడి ప్రారంభమైంది. ఇప్పటికే చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జనాలు తరలి వస్తున్నారు. ప్రధానంగా ఈ నెల 6, 7 తేదీల్లో గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఉంటాయని కాకినాడ సిటీ, రూరల్ వినాయక ఉత్సక కమిటీలు తెలిపాయి. ఆరో తేదీ శనివారం, మరుసటి రోజు ఆదివారం కావడంతో సూర్యారావుపేట బీచ్‌లో పెద్ద ఎత్తున గణేశ విగ్రహాలు నిమజ్జనోత్సవాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా అన్ని శాఖలు ఏర్పాట్లలో తనమునకయ్యాయి. మండల పరిషత్ నిధులతో బీచ్‌లో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. వినాయక విగ్రహాలను సాగర తీరం వరకు తీసుకువెళ్లి తిరిగి పక్కనే మరోవైపు నుంచి వచ్చేలా రోడ్లు నిర్మిస్తున్నారు. క్యూ లైన్లతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. సూర్యారావుపేటతో పాటు మండలంలో పలు గ్రామాలకు చెందిన పారిశుధ్య సిబ్బంది బీచ్‌ను శుభ్రం చేస్తున్నారు.

నిఘా నడుమ..

బీచ్‌లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. సముద్రంలో స్నానాలకు దిగేందుకు లోపలకు వెళ్లేవారికి అపాయం కలగకుండా గజ ఈతగాళ్లతో పాటు విగ్రహాలు సాగర గర్భంలో నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

న్యూ ఎన్టీఆర్ బీచ్‌లోనే..

వినాయక విగ్రహాల నిమజ్జనాలకు సూర్యారావుపేట సాగర తీరంలోని న్యూ ఎన్టీఆర్ బీచ్‌కు మాత్రమే అనుమతి ఉందని తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. నేమాం, ఇతర ప్రాంతాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని సోమవారం ఆయన కోరారు. మద్యం తాగి ఊరేగింపులు, సముద్ర స్నానాల్లో పాల్గొనవద్దని, దైవ కార్యక్రమం అంతా సజావుగా సాగేలా భక్తులు సహకరించాలని కోరారు. ఈనెల 6, 7 తేదీల్లో జరగనున్న నిమజ్జనాల కోసం గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



సూర్యారావుపేట గ్రామ పరిధిలోని బీచ్‌లో పెద్ద ఎత్తున నిమజ్జనాలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలకు రోడ్డు నిర్మాణం చేపట్టాం. క్యూలైన్లు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నాం. బీచ్‌ను శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

– పి.సతీష్, ఎంపీడీఓ, కాకినాడ రూరల్

అనుమతి ఉన్నచోటే..



అనుమతి ఉన్నచోటే వినాయక విగ్రహాల నిమజ్జనాలను చేయాలి. సాగర తీరంలో ఎక్కడ పడితే అక్కడ చేసేందుకు అనుమతి లేదు. కొన్నిచోట్ల లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయి. సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనోత్సవాలకు గట్టి భద్రత, బందోబస్తు కల్పిస్తున్నాం.

– చైతన్యకృష్ణ, కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

మంత్రిప్రగడ వారి సత్రం ఈఓగా శ్రీనివాస్

బోట్‌క్లబ్: స్థానిక సినిమా రోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం ఈఓగా సీహెచ్‌ఎస్ఎస్ శ్రీనివాస్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ గతంలో ఈఓగా పనిచేసిన కె.సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ పొందడంతో గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

అక్రిడిటేషన్లు పెంచాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ 84ను సవరించి చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రిడిటేషన్లు పెంచాలని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతి పత్రం సమర్పించింది. జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఎస్ఎం కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ జీఓ స్థానిక చిన్న, మధ్య తరహా దినపత్రికలకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎస్ కనకాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మంతెన శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలు పొడిగించినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి దాసరి నాగార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో ఆగస్టు 31వ తేదీ నాటికి వాలిడిటీ ఉన్న అక్రిడిటేషన్ కార్డులకు సోమవారం నుంచి డీఐపీఆర్ఓ, కాకినాడ వారి కార్యాలయంలో మూడు నెలల వాలిడిటీ పొడిగింపునకు స్టిక్కర్లు అతికిస్తారన్నారు.

వ్యాపార కేంద్రాలుగా దేవాలయాలు



పెనుగుదురు సమావేశంలో మాట్లాడుతున్న రఘు

కరప: ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండాల్సిన దేవాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు విమర్శించారు. పెనుగుదురులో సోమవారం ఆయన మాట్లాడారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నిర్వహణలో ఉన్న దేవాలయాల వద్ద ధర్మం కంటే దుర్మార్గం పెరిగిందని విమర్శించారు. భక్తులు తీసుకొచ్చిన కొబ్బరి కాయలు వారితో కొట్టనీయకుండా సిబ్బందే కొట్టి, సొమ్ము డిమాండ్ చేస్తున్నారన్నారు. అమ్మవారికి సమర్పించే చీరలు స్వయంగా భక్తులు సమర్పించుకునే అవకాశం లేకుండా పూజారులే లాగేసుకుని, డబ్బులు డిమాండ్ చేయడం దారుణమన్నారు. దర్శనాల పేరుతో టికెట్ ధరలు పెట్టి ధర్మ దర్శనం కనిపించకుండా భక్తులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలన్నింట్లో ఇదే విధానం ఉందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి, దేవాలయాల్లో వ్యాపార దృక్పథాన్ని విడనాడి, ఆధ్యాత్మికత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మం కోసం అవసరమైతే ప్రభుత్వమే నిధులు సమకూర్చాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసినట్టు రఘు తెలిపారు. సంస్థ ప్రతినిధులు కాదా సత్యనారాయణ, ముమ్మిడి శ్యామ్‌సుందర్‌రావు, పేకేటి లక్ష్మీకాంతం, పడాల తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

పిఠాపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు పట్టించుకోడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేష బాబ్జి విమర్శించారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు అండ్ హెల్పర్ల యూనియన్ పిఠాపురం ప్రాజెక్టు మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలల గడుస్తున్నా నేటికీ సమస్యల పరిష్కరించడంలో, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి, సీఐటీయూ మండల కార్యదర్శి కుంచే చిన్న మాట్లాడుతూ పనిచేయని స్మార్ట్ ఫోన్ చేతికిచ్చి అనేక యాప్‌లను వినియోగించాలంటూ ఆదేశాలివ్వడంతో ఫోన్లు మొరాయిస్తున్నారని అన్నారు. పని చేయని ఫోన్లను అధికారులకు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దడాల పద్మ, కుంచే చిన్న, అధ్యక్ష కార్యదర్శులుగా జి.విజయశాంతి, డి.తులసిదేవి, కోశాధికారిగా రామలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా నళిని, డి.సత్యవతి, ఆర్ బేబీ, గంగా లక్ష్మి, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గొల్లప్రోలు కార్యదర్శి నందీశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేషు బాబ్జీ

స్నేహ బంధానికి మార్గదర్శి శ్రీకృష్ణుడు



పోతన భాగవతంపై మాట్లాడుతున్న ఎరమ్రిల్లి శారద

బోట్‌క్లబ్: స్నేహ బంధానికి అగ్రస్థానమిచ్చి, ఈ విషయమై విశ్వానికి దారి చూపిన భగవంతుడు శ్రీకృష్ణుడు ఒక్కడేనని ప్రముఖ ఉపన్యాసకురాలు ఎరమ్రిల్లి శారద అన్నారు. వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో సోమవారం గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పోతన భాగవత అంతర్గతమైన కుచేలోపాఖ్యానంపై ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ విద్యావేత్త వింజరపు జనార్దనం మాట్లాడుతూ సంస్కృత ప్రచార సభ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రచార సభ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు, సభ్యుడు ఆకెళ్ల సత్యస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

తురగా సూర్యారావుకు పురస్కారం

బోట్‌క్లబ్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నెల్లూరులో మూడు రోజుల పాటు జరిగిన కవితా సమ్మేళనంలో కాకినాడ చెందిన కవి తురగా సూర్యారావుకు పురస్కారం లభించింది. జై భారత్– ప్రేమ వీర త్యాగాలు కవితకు ఈ పురస్కారం దక్కింది. సేవా కమిటీ అధ్యక్షులు సుబ్బానాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో సత్కరించి ఈ పురస్కారాన్ని అందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బాలాజీచెరువు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ రాహుల్‌మీనాకు సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ ఉద్యోగులకు పదోన్నతులతో పాటు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందించాలని, పని వేళల మార్పు వంటి విషయాలపై విన్నపించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ, అసోసియేట్ అధ్యక్షుడు రేపార వెంకట రాము, సలాది సాయి సత్యనారాయణ, ములం పాక శ్రీనివాసరావు, కిశోర్ పాల్గొన్నారు.



జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

కన్నబాబుకు తమ్మినేని పరామర్శ



కన్నబాబును పరామర్శించి ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ స్పీకర్ సీతారామ్

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ సోమవారం పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్‌లోని ఆయన నివాసంలో కన్నబాబును కలసి ఓదార్చారు. ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నబాబును పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట రాంజీ, కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియ విజయ, కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంప లక్ష్మణరావు, రాష్ట్ర ఇంటలెక్చువల్ కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా అధికారి కోట గోవిందరావు తదితరులు ఉన్నారు.

అభయమివ్వు.. ఆదినాయకా

కరప: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని చవితి మండపాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. వేళంగి మార్కెట్ సెంటర్‌లోని వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విష్ణు రూపంలోని మట్టి వినాయకుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. మార్కెట్, నిత్యానందపురం సెంటర్లలో వినాయక ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ పోటాపోటీగా నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలోనే ప్రసిద్ధి. రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేషంగా భక్తులు తరలివస్తున్నారు. మార్కెట్ సెంటర్‌లో పదకొండున్నర అడుగుల ఎత్తులో విష్ణురూపంలోని వినాయకుడిని శిల్పి సానా శ్రీనివాస్ (కెమిస్ట్) రూపొందించారు. దీనికి ఓ ట్రాక్టర్ మట్టిని వినియోగించామని ఆయన తెలిపారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా మట్టితో తయారు చేశామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సోమవారం సాయంత్రం పసుపు, కుంకుమలతో మట్టి వినాయకుడికి పూజలు చేశారు.

నిమజ్జన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు

గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కరప ఎస్‌ఐ టి.సునీత కోరారు. ఆమె సిబ్బందితో కలసి మండలంలో పర్యటించారు. వినాయక మండపాల కమిటీలకు నిబంధనలు వివరించారు. కరప, పెనుగుదురు, అరట్లకట్ట, ఉప్పలంక, గొర్రిపూడి, వేములవాడ, వేళంగి తదితర గ్రామాల్లోని పంట, మురుగు కాలువల వద్ద నిమజ్జనం చేసే ప్రదేశాలను గుర్తించి అక్కడ పోలీసు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిమజ్జనం రోజున గణేష్ విగ్రహాల ఊరేగింపు ప్రారంభం నుంచి ముగింపు వరకు జరిగే పరిణామాలన్నింటికీ ఆర్గనైజింగ్ కమిటీలే బాధ్యత వహించాలన్నారు. వినాయక విగ్రహం తీసుకెళ్లే వాహన డ్రైవర్ మద్యం తాగి నడపరాదని, చివరి వరకు వాహనం విడిచి వెళ్లరాదన్నారు. ఊరేగింపులో పాల్గొనే వారు మద్యం తాగరాదని అన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



వేళంగి మార్కెట్ సెంటర్‌లో 11.5 అడుగుల విష్ణురూపంలోని మట్టి వినాయకుడు

గణపతికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక పంచామృతాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ ఈఓ వి.వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కాకినాడ సంపత్ విజయగణపతి

ఆకట్టుకున్న గీతా పారాయణ

కరప: స్థానిక పాత వినాయకుని వీధిలో గణేష్ బాలభక్త బృందం ఏర్పాటు చేసినన వినాయక మండపంలో సోమవారం మహిళా భక్తులు గీతా పారాయణ చేశారు. ఈ వీధిలో గణేష్ బాలభక్త బృందం గత 12 ఏళ్లుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా కాకినాడ మహిళా పారాయణకర్తలు 25 మంది వచ్చి, గీతా పారాయణ చేశారు. భక్తి గీతాలు ఆలపించారు.



కరపలోని వినాయక మండపంలో గీతా పారాయణ చేస్తున్న మహిళలు

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు భాద్రపత మాసం, నవమి సోమవారం కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మ వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉప ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మ వారిని దర్శించుకున్నారు. స్వామి వారి తొలి అభిషేకాన్ని క్యూలైనులో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో, గొంచాలలోని శివాలయంలో, పీబీ దేవం శివాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమార రామభీమేశ్వరస్వామి

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని ఆయన అన్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత ఆదేశంతో మండలంలోని పొన్నాడ శ్రీరాంపురం, రమణక్కపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల యాకబ్, కడారి సతీష్, పెనుమల్లు పాపిరెడ్డి ఆధ్వర్యంలో ×బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ× కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో పార్టీల పేరుతో వివక్ష చూపరాదని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, జ్యోతుల బాబులు, కాదులూరి నేరేళ్లరెడ్డి, యాదల నాగేంద్ర, కారే కిరణ్, బండి సత్తిబాబు, కొయ్య స్వామి, యాదల శివ, కాళ్ల గోవిందు, మెరుగు ఆనందరావు, చెట్లూరి రాము, సాక చిన్నబ్బాయి, మేక నాని తదితరులు పాల్గొన్నారు.



పొన్నాడ గ్రామసభలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు